RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :202 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 19 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad



కర్ణాటక ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

4 లో

## విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



## తమిళ రాజకీయాల్లో కీలక మలుపు..

-సీఎం విజయ్‌కు దగ్గరవుతున్న వైగో!
-డీఎంకే నేతృత్వంలోని కూటమి నుంచి వైదొలగనున్న ఎండీఎంకే
-సీఎం విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వానికి దగ్గరయ్యేందుకు సన్నాహాలు
-డీఎంకే గుర్తుపై గెలవడంతో ఎమ్మెల్యేల రాజీనామా అంశంపై పార్టీలో చర్చ
-జూన్ 27న పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం
-విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడిన వైగో కుమారుడు దురై వైగో

తమిళనాడు రాజకీయాల్లో మరో కీలక పరి ణామం చోటుచేసు కుంటోంది. సీనియర్ నేత వైగో నేతృత్వంలోని మరుమలార్చి ద్రావిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) పార్టీ, అధికార డీఎంకే నేతృత్వంలోని మిగతా 2లో...

# జీ7లో సభ్యత్వం లేదు

## అయినా భారత్‌కు రెడ్ కార్పెట్ ఎందుకు?

గ్లోబల్ సౌత్ గొంతుకగా భారత్‌కు గుర్తింపు - ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి

చైనాకు చెక్ పెట్టగలిగే వ్యూహాత్మక భాగస్వామిగా భారత్‌కు గుర్తింపు - వాతావరణ లక్ష్యాల్లో కీలక పాత్ర

స్వతంత్ర విదేశాంగ విధానంతో ప్రత్యేకత




**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక, రాజకీయ నిర్ణయాలపై పశ్చిమ దేశాలదే పైచేయి ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. జీ7లో సభ్యదేశం కాకపోయినా.. భారత్‌కు ప్రతి ఏడాది ప్రత్యేక ఆహ్వానం అందడం వెనుక ఇదే కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరగడంతో జీ7 దేశాలు కూడా మనదేశ అభిప్రాయాన్ని విస్మరించలేని పరిస్థితి ఏర్పడింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, మిగతా 2లో...

## విశాఖ గాజువాకలో భారీ అగ్నిప్రమాదం

పోలీసుల పర్మిషన్ లేకపోయినా కోర్టు ఆర్డర్‌తో షాప్

రద్దీ ప్రాంతంలోని టపాసుల దుకాణంలో చెలరేగిన మంటలు

మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించిన ఫైర్ సిబ్బంది

రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్




**విశాఖపట్నం, సింధూరదర్శిని:** విశాఖపట్నంలోని అత్యంత రద్దీగా ఉండే కొత్త గాజువాక మార్కెట్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అక్కడున్న 'శివ ఫైర్‌వర్క్స్' అనే టపాసుల దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు, వ్యాపారులు తీవ్ర భయాందో ళనలకు గురయ్యారు. దుకాణం నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ ఎగసిపడటంతో మార్కెట్ రోడ్డు అంతా గందరగోళంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫైర్ మిగతా 2లో...

## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు

ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!

తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు

దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు

రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం

వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ

ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు

అవి సద్దుమణిగాకే ఇంధన ధరల్లో సవరణకు అవకాశం



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. ఇంధన ధరల నిర్ణయంలో ముడి చమురు ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మిగతా 2లో...

# ఆక్వా ఫీడ్ ధరపై రైతులు-తయారీదారులతో సీఎం చంద్రబాబు సమావేశం



ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు కంపెనీల అంగీకారం

ఆక్వా ఫీడ్ ధరల స్థిరీకరణపై కమిటీ ఏర్పాటు

ఫీడ్ ధర తగ్గింపు, విద్యుత్ రాయితీపై సీఎంకు రైతుల ధన్యవాదాలు

గత ప్రభుత్వంలో ఆరు సార్లు ఫీడ్ ధర పెంచినా పట్టించుకోలేదన్న రైతులు

**అమరావతి, సింధూరదర్శిని:** ఆక్వా ఫీడ్ ధరల పెంపుతో గత కొన్ని రోజులుగా తలెత్తిన సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిష్కారం చూపించారు. అటు ఆక్వా రైతులపై అధిక భారం పడకుండా, ఇటు ఫీడ్ తయారీదారులు నష్టపోకుండా ప్రస్తుత ధరపై రూ.4 తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికి ఫీడ్ తయారీదారులు, ఆక్వారైతులు అంగీకరించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్‌పీ రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. దీనిపై చేపలు, రొయ్యల సాగు రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులు, ఆక్వారైతులు, ఫీడ్ తయారీదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ధర తగ్గించడంతో పాటు... ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో మిగతా 2లో...

# మలేషియాలో ఘన వ్యర్థాల నిర్వహణ విధానాల అధ్యయనంలో మంత్రి నారాయణ

రెండు రోజుల పర్యటన కోసం మలేషియా చేరుకున్న మంత్రి నారాయణ

కౌలాలంపూర్‌లోని భారత హైకమిషన్ కార్యాలయంలో మంత్రికి ఘన స్వాగతం



**మలేషియా సింధూర దర్శిని:** రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ రెండు రోజుల పర్యటన నిమిత్తం మలేషియా చేరుకున్నారు. కౌలాలంపూర్‌లోని భారత హైకమిషన్ కార్యాలయంలో అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మలేషియాలోని క్లాంగ్ పార్లమెంట్ సభ్యుడు గణపతిరావు, మంత్రి పప్పారాయుడు మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. అనంతరం మలేషియాలో ఘన వ్యర్థాల నిర్వహణ రంగంలో అమలవుతున్న ఆధునిక విధానాలను అధ్యయనం చేసే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. సెలంగార్ రాష్ట్రంలోని ఖజానుదీ వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థ కార్యాలయంలో మంత్రి నారాయణకు అక్కడి అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. గృహాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమల నుంచి ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను సేకరించడం, రవాణా చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం వంటి అంశాలను వివరించారు. ముఖ్యంగా వ్యర్థాల విభజన, సాంకేతిక వినియోగం, రీసైక్లింగ్ వ్యవస్థలు, ప్రజల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న విధానాలపై మంత్రి ఆసక్తిగా తెలుసుకున్నారు. మధ్యాహ్నం మంత్రి నారాయణ క్షేత్రస్థాయిలో పలు వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను సందర్శించారు. బయో మెడికల్ వేస్ట్, ఇండస్ట్రియల్ వేస్ట్, పౌల్ట్రీ వ్యర్థాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్లాంట్ల పనితీరును పరిశీలించారు. వ్యర్థాల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ, శక్తి ఉత్పత్తి, రీసైక్లింగ్ ప్రక్రియలపై అక్కడి నిపుణులతో చర్చించారు. అనంతరం సెన్విరో ఇండస్ట్రియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించిన మంత్రి, ప్రమాదకర మరియు పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్న అత్యాధునిక సాంకేతిక విధానాలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ మలేషియా మిగతా 2లో...

# జీ7లో సభ్యత్వం లేదు.. అయినా భారత్‌కు రెడ్ కార్పెట్ ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

జర్మనీ, ఇటలీ, జపాన్ కలిసి జీ7 కూటమిగా ఉన్నాయి. ఈ దేశాలే ప్రపంచంలోని సంపన్న ఆర్థిక వ్యవస్థలుగా గుర్తింపు పొందాయి. అయితే వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభాలు, భద్రతా సవాళ్లు, సరఫరా వ్యవస్థల వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకునే సమయంలో భారత్‌ను కూడా చర్చల్లో భాగస్వామి చేస్తున్నాయి.

**గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుక**

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు అంతర్జాతీయ వేదికలపై తగిన స్థాయిలో ప్రతిబింబించడం లేదనే భావన చాలాకాలంగా ఉంది. ఈ దేశాల తరఫున బలంగా మాట్లాడుతున్న దేశంగా భారత్ ఎదిగింది. అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వారధిగా వ్యవహరిస్తోంది. అందుకే ప్రపంచ స్థాయి విధానాలు విజయవంతం కావాలంటే భారత్ వంటి దేశాల సహకారం అవసరమని జీ7 దేశాలు భావిస్తున్నాయి.

**భారీ మార్కెట్‌గా భారత్**

140 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగం, సాంకేతిక రంగాల్లో వేగంగా ఎదుగుతోంది. సరఫరా వ్యవస్థలను విస్తరించాలనుకుంటున్న పలు దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారింది. ప్రపంచ ఆర్థిక స్థిరత్వంలోనూ భారత్ పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. అందుకే జీ7 దేశాలు భారత్‌తో ఆర్థిక సహకారానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

**చైనా ప్రభావానికి చెక్**

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావం పెరుగుతుండటం పలు దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను వ్యూహాత్మక భాగస్వామిగా పరిగణిస్తున్నారు. భౌగోళిక స్థానం, సైనిక సామర్థ్యం, ఆర్థిక బలం కారణంగా ఆసియాలో 'పవర్ బ్యాలెన్స్'ను కాపాడగల దేశంగా భారత్‌ను చూస్తున్నారు.

**వాతావరణ లక్ష్యాల్లో కీలక పాత్ర**

ప్రపంచ వాతావరణ లక్ష్యాలు సాధించాలంటే 140 కోట్ల జనాభా ఉన్న భారత భాగస్వామ్యం తప్పనిసరి. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ భారీ పెట్టుబడులు పెడుతోంది. అంతర్జాతీయ సౌర కూటమి వంటి కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోంది. అందుకే వాతావరణ మార్పులపై జరిగే ప్రతి కీలక చర్చలో భారత్‌కు ప్రత్యేక స్థానం లభిస్తోంది.

**స్వతంత్ర విదేశాంగ విధానం**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వంటి అంశాల్లో భారత్ తన స్వతంత్ర వైఖరిని కొనసాగిస్తోంది. ఏ ఒక్క కూటమికీ పూర్తిగా అనుకూలంగా కాకుండా, చర్చలు, దౌత్య పరిష్కారాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ విధానం వల్లే వివిధ దేశాలతో సమాన సంబంధాలు కొనసాగించగలుగుతోంది.

**నామమాత్రం కాదు**

జీ7 సమావేశాల్లో భారత్ పాల్గొనడం ఇప్పుడు కేవలం ఆహ్వానిత దేశం హోదాకు మాత్రమే పరిమితం కావడం లేదు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత, సాంకేతికత, అభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలు, పరిష్కారాలను ప్రపంచానికి సూచిస్తోంది.

# మలేషియాలో ఘన వ్యర్థాల నిర్వహణ విధానాల అధ్యయనంలో మంత్రి నారాయణ



(మొదటిపేజీ తరువాయి)

అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ కూడా మంత్రితో పాటు పాల్గొన్నారు. మలేషియాలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసి, వాటిలో రాష్ట్రానికి అనుకూలమైన విధానాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణలో మలేషియా సాధించిన పురోగతి, సాంకేతిక వినియోగం, సమర్థవంతమైన నిర్వహణ వ్యవస్థలు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడతాయని మంత్రి పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో ఆధునిక వ్యర్థాల నిర్వహణ వ్యవస్థల అభివృద్ధికి ఈ పర్యటన దోహదపడనుంది.

# ఆక్వా ఫీడ్ ధరపై రైతులు-తయారీదారులతో సీఎం చంద్రబాబు సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు. ఫీడ్ ధరలతో పాటు, ప్రాసెసింగ్ విధానం, కాలుష్య నియంత్రణ పైనా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై ఎటువంటి చొరవ తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆక్వా రైతులు ఈ సందర్భంగా తెలిపారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ ధర రూ.107.80కి చేరిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందన్నారు. తామెప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని, ఇటీవల కొందరు ఆక్వా రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంతో అన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని రైతులు గుర్తు చేశారు.

**సమస్యలు విన్నవించిన రైతులు**

ప్రస్తుతం ఆక్వాసాగులో ఎదురవుతోన్న సమస్యలను ముఖ్యమంత్రితో సమావేశంలో ఆక్వా రైతులు వెల్లడించారు. సాగుకు వినియోగించే అన్ని వస్తువుల ధరలు పెరిగాయని... కానీ ఆక్వా ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగడం లేదన్నారు. ముడిసరుకు ధర పెరిగినప్పుడు ఫీడ్ ధర పెంచుతున్నారు కానీ, ముడిసరుకు ధర తగ్గినప్పుడు మాత్రం ఫీడ్ ధర తగ్గించడం లేదన్నారు. దీనికితోడు ప్రాసెసింగ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మత్స్యశాఖ నుంచి రైతులకు అందించే రాయితీలపైనా అందరికీ అవగాహన కల్పించాలని రైతులు కోరారు. రాయితీలకు సంబంధించి నిర్దేశించిన ఎంప్యానెల్ విషయంలో మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రొయ్యల చెరువులకు బీమా సౌకర్యాన్ని విస్తృత పరిచేలా చూడటంతో పాటు, నర్సరీ పాండ్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలన్నారు. అలాగే చేపలు, రొయ్యల చెరువులకు నీటి వనరులు అందించాలని రైతులు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

**సోయా ధర పెరిగిందన్న ఫీడ్ కంపెనీల ప్రతినిధులు**

సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకు కొరత ఉందని, దేశీయంగా వీటి ధర కూడా అధికంగా ఉందని ఫీడ్ కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ధర తక్కువగా ఉన్న అమెరికా నుంచి సోయా దిగుమతులకు అనుమతి లేకపోవడంతో దేశీయ మార్కెట్లో రెట్టింపు ధరకు కొంటున్నామన్నారు. దీంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వివరించారు. వాస్తవంగా రూ.20ధర పెంచాల్సి ఉన్నప్పటికీ...రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధర పెంపును రూ.12కి పరిమితం చేశామని చెప్పారు.

**ఆక్వా రైతులకు రూ.1,543 కోట్ల విద్యుత్ రాయితీ**

లక్షలాది మంది ఆధారపడిన ఆక్వారంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ఈ రెండేళ్లలో రూ.1,543 కోట్ల మేర విద్యుత్ రాయితీ రూపంలో ఆక్వాసాగుకు ఇచ్చామని సీఎం అన్నారు. ఇప్పుడు కంపెనీలు ఫీడ్ ధరల పెంచడంతో జోక్యం చేసుకున్నామని సీఎం చెప్పారు. ధరల సమస్య పరిష్కారానికి అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని... అప్పుడే ఇద్దరికీ లబ్ధి కలుగుతుందన్నారు. రైతులు కూడా ఉత్పత్తి వ్యయం తగ్గించుకునేందుకు ఆలోచన చేయాలన్నారు. చేపలు, రొయ్యల రైతులు ఇద్దరికీ తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సంఘాలు సమావేశాలు నిర్వహించుకుని సమస్యలకు పరిష్కారాలు వెతకాలని సీఎం చెప్పారు. ఆక్వారంగాన్ని ఆధునీకరించేలా, సాంకేతిక వినియోగం పెరిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారాయని, ఆక్వా ఉత్పత్తులకు మరింత డిమాండ్ పెరిగిందని దీనిని వినియోగించుకోవాలన్నారు. అమెరికా ఆంక్షలతో వేరే దేశాలకు మార్కెట్ విస్తరించేలా చేశామని చెప్పారు. నాణ్యత, సర్టిఫికేషన్ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిరప పంటకు పురుగుమందులు వినియోగించడంతో ఇటీవల ఎగుమతులను చైనా తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ లిక్కర్ స్కాం కేసు... మాజీ మంత్రి కారుమూరి తనయుడి అరెస్ట్

అమరావతి, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ లిక్కర్ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో భాగంగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌ను ఈడీ అధికారులు గురువారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. అనంతరం తదుపరి విచారణ నిమిత్తం ఆయన్ను ఈడీ కార్యాలయానికి తరలించారు. సునీల్ అరెస్టుతో ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్



కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మద్యం రవాణా టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఈడీ ఆరోపిస్తోంది.

సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ వంటి కొన్ని సంస్థలకు అనుకూలంగా టెండర్ నిబంధనలను నిబంధనలకు విరుద్ధంగా మార్చారని, తద్వారా ప్రభుత్వ ఆదాయానికి సుమారు రూ.195 కోట్ల మేర గండికొట్టారని ఈడీ అంచనా వేసింది.

# తమిళ రాజకీయాల్లో కీలక మలుపు..

(మొదటిపేజీ తరువాయి)

సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (స్రూూ) నుంచి వైదొలగాలని దాదాపుగా నిర్ణయించుకుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) ప్రభుత్వానికి దగ్గరయ్యేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 27న జరగనున్న పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో డీఎంకే కూటమి నుంచి బయటకు వస్తున్నట్లు ఎండీఎంకే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ మార్పు అంత సులువు కాదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎండీఎంకే తరఫున గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు, డీఎంకే 'ఉదయించే సూర్యుడు' గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. దీంతో వారు నేరుగా విజయ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలిచిన తర్వాత టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలనేది ఆ పార్టీ యోచనగా కనిపిస్తోంది. గత వారం రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. మంగళవారం రోజున రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ మంత్రి ఆధవ్ అర్జున, వైగోతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఆ మరుసటి రోజే, బుధవారం, వైగో స్వయంగా సచివాలయంలో ముఖ్యమంత్రి విజయ్‌తో సమావేశమ య్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీ తర్వాత, పొత్తుల మార్పుపై వస్తున్న వార్తలను వైగో కొట్టిపారేసినప్పటికీ, వీరి మధ్య ప్రధానంగా రాజకీయ అంశాలే చర్చకు వచ్చినట్లు సమాచారం. మరోవైపు, వైగో కుమారుడు, తిరుచిరాపల్లి ఎంపీ అయిన దురై వైగో, విజయ్ ప్రభుత్వానికి బహిరంగంగా మద్దతు తెలుపుతూ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఇది కేవలం ప్రభుత్వంపై వ్యతిరేకత తీసుకురావడానికి ఒక 'కథనాన్ని' సృష్టించే ప్రయత్నమని అన్నారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, వాటితో పోలిస్తే ఇప్పుడు నేరాలు గణనీయంగా ఏమీ పెరగలేదని వ్యాఖ్యానించారు. డీఎంకే గుర్తుపై పోటీ చేయడం అనే 'దురదృష్టం' వల్లే తాము టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వలేకపోతున్నామని దురై వైగో ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే డీఎంకే మాజీ మిత్రపక్షాలైన వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం వంటి పార్టీలు విజయ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాయి. ఇప్పుడు ఎండీఎంకే కూడా అదే బాటలో పయనించనుంది. ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే గుర్తుపై నాలుగు స్థానాల్లో పోటీ చేసిన ఎండీఎంకే, రెండింటిలో గెలిచింది. ఒకవేళ ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే, తమిళనాడు అసెంబ్లీలో ఖాళీల సంఖ్య 8కి చేరుకుంటుంది. ఇందులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ రాజీనామా చేసిన తిరుచ్చి ఈస్ట్ స్థానం కూడా ఉంది.

# పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు..


(మొదటిపేజీ తరువాయి)

మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు.

ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# విశాఖ గాజువాకలో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)





సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ఈ అగ్నిప్రమాద ఘటన కారణంగా కొత్త గాజువాక మార్కెట్ ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంపై విశాఖ సౌత్ ఏసీపీ శ్రీనివాస్ స్పందిస్తూ ఒక కీలక విషయాన్ని వెల్లడించారు. ప్రమాదానికి గురైన 'శివ ఫైర్‌వర్క్స్' దుకాణానికి అసలు పోలీస్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు పర్మిషన్ నిరాకరించినప్పటికీ... దుకాణ యజమాని నేరుగా కోర్టును ఆశ్రయించి, అనుమతి ఉత్తర్వులు తెచ్చుకుని మరీ ఇక్కడ దుకాణాన్ని నడుపుతున్నట్లు ఏసీపీ వివరించారు. జనావాసాలు దట్టంగా ఉండే ప్రాంతాలు, వ్యాపార కూడళ్ల వద్ద ఇలాంటి ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు, బాణసంచా విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. కోర్టు అనుమతులు ఉన్నప్పటికీ, నిబంధనల ఉల్లంఘన, ప్రజా భద్రతకు ముప్పు కలిగించినందుకు గానూ సదరు షాపు యజమానిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తగ్గని సాయం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కోవూరు ఎమ్మెల్యే



నెల్లూరు( సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ అనేది పేదల పాలిట సంజీవనిగా పనిచేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే కాకుండా మానవతా దృక్పథంతో కూడా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు నెల్లూరు నగరంలోని విపిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటినుండి కోవూరు నియోజకవర్గంలో 25 విడతలుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశామన్నారు. అనారోగ్య కారణాలతో బాధపడి ఆర్థిక ఇబ్బందులు కలిగిన వారికి ముఖ్యమంత్రి ఇంటి పెద్దలాగా, ఆత్మ బంధువు లాగా సీఎం సహాయనిధితో అండగా నిలువడం అభినందనీయమన్నారు.కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 900మందికి దాదాపు రూ.10.5కోట్ల మేర సీఎం సహాయనిధి అందజేశామన్నారు.నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ద్వారా 138 మందికి దాదాపు రూ.2 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేయడం జరిగిందన్నారు.సిఎంఆర్ఎఫ్ ద్వారా అత్యవసర సహాయం అందిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు నిరుపేదలకు ఆపన్నహస్తం అందజేస్తున్నారన్నారు. అనారోగ్యబారిన పడి ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందన్నారు.విడవలూరు మండలం వరిణి గ్రామానికి చెందిన ముక్కు భానుచంద్రకు ఇటీవల విద్యుత్‌షాక్ గురై అంగవైకల్యం కలిగిందన్నారు. వారికి సి ఎం ఆర్ ఎఫ్ ద్వారా రూ.6 లక్షలను ముఖ్యమంత్రి మంజూరు చేసి ఆదుకున్నారన్నారు.నెల రోజుల్లో ప్రమాదంలో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు భీమా చెక్కులను రూ.5 లక్షల చొప్పున అందజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 8 మందికి ప్రమాద బీమా చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. పేదల పట్ల సిఎం చంద్రబాబు చేస్తున్న సహాయానికి కోవూరు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ఈసందర్భంగా భానుచంద్రతో పాటు లబ్ధిదా రులు, వారి కుటుంబ సభ్యులు తమకు కష్టకాలంలో ప్రభుత్వం నుండి సిఎంఆర్ఎఫ్ సహాయం అందచేసిన ందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి, వేమిరెడ్డి దంపతులకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

## కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

యువ క్రికెటర్ ఎల్లు హన్షిత్‌ను అభినందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



నెల్లూరు (సింధూరదర్శిని) 18జూన్ నెల్లూరుజిల్లా; క్రికెట్‌లో ఉన్నత శిఖారాలు అధిరోహించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కొడవలూరు మండలం ఆలూరు పాడుకు చెందిన యువ క్రికెట్ క్రీడాకారుడు ఎల్లు హన్షిత్‌ను కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల కాలంలో వై ఎస్ పి ఎ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో హన్షిత్ ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తెచ్చారు. ఈఏడాది ఏప్రిల్‌లో వైఎస్‌పిఏ వారు నెల్లూరులో నిర్వహించిన అంతర్రాష్ట్ర అండర్-19 క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా తరపున పాల్గొని, జాతీయ స్థాయికి ఎంపికవడమే కాకుండా గోల్డ్ మెడల్ (బంగారు పతకం) సాధించారు.అదే విధంగా, మే నెలలో జమ్మూ కాశ్మీర్‌లోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వైఎస్‌పిఏ వారు నిర్వహించిన జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున హన్షిత్ ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ (వెండి కప్) కైవసం చేసుకోవడంలో హన్షిత్ కీలక పాత్ర పోషించారు.ఈ నేపథ్యంలో హన్షిత్ ప్రతిభను గుర్తిస్తూ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

యువ క్రీడాకారులకు క్రీడల పట్ల ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి క్రీడాకారుడు హన్షిత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే అందిస్తున్న సహాయ సహకారంతో తనలో మరింత బాధ్యతను, ఉత్సాహాన్ని నింపిందని హన్షిత్ పేర్కొన్నారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు



నెల్లూరు (సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; జిల్లాలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు పల్స్ పోలియో నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో 2,67,750 మంది 0 నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లలు ఉన్నారని వారందరికీ పల్స్ పోలియో చుక్కలు వేసి 100% పూర్తిచేయాలని తద్వారా భవిష్యత్తులో పిల్లలకు ఎటువంటి రుగ్మతలు లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పల్స్ పోలియో నిర్వహణకు 7074 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. 1620 ఎన్ఐడి బూతులు ఏర్పాటు చేసినట్లు, అదేవిధంగా మొబైల్ యూనిట్లు 83 టాన్సిట్ యూనిట్లు 88 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో స్థానిక సంస్థల సహకారం కూడా తీసుకోవాలన్నారు. అలసిపోలియో కార్యక్రమం నిర్వహణ సమయంలో నిరంతరం విద్యుత్ ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. చేపల చెరువుల వద్ద ఉండే సిబ్బంది వారి పిల్లలకు కూడా ఫోలియో చుక్కలు వేయాలన్నారు. రైల్వే స్టేషన్లో ,బస్టాపులలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించే రోజు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించాలని తొలి రోజున పల్స్ పోలియో కేంద్రాల వద్ద పిల్లలకు చుక్కలు వేస్తారని రెండవ రోజున ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఐసిడిఎస్, విద్యాశాఖ వైద్య ఆరోగ్యశాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వలస కూలీలు నివసించే స్థలాలను గుర్తించి ఆ వివరాలను సంబంధిత మండల రెవెన్యూ అధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇవ్వవలెనని కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్మెంట్ ను అనుకోరారు. గనులలో పని చేయు వారి కుటుంబాలను గుర్తించి వారికి పల్స్ పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, జిల్లా ఇమేజెస్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం



గూడూరు ( సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని కమ్మవారిపాలెం గ్రామపంచాయతీ బూత్ నంబర్ 126 లో సర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం 25 వ యూనిట్ ఇన్చార్జి పచ్చ వెంకటేశ్వర్ల నాయుడు , వేమసాని గజేంద్రనాయుడు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడమే లక్ష్యం

## డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ అధినేత బొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి



గూడూరు (సింధూరదర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా; పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని ఉద్దేశంతో డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ స్థాపించడం జరిగిందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధినేత బొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మీడియా సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేశారు.గూడూరు పట్టణంలోని సొసైటీలో ఉన్న డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధినేత బొమ్మిరెడ్డి సురేందర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ స్థాపించి 17 సంవత్సరాలు పూర్తయిందని, ఈ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితంగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యను అందించి వారిని ప్రయోజకులను చేయడం జరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో 2,3 తరగతులు చదివే పేద విద్యార్థులను ఎంపిక చేసి ఇంటర్మీడియట్ వరకు వారికి పూర్తిగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత విద్య అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం విద్యార్థుల ఎంపిక నెల 25.వ తేదీ గూడూరు పట్టణంలో జరుగుతుందని 24 వ తేదీ లోపు ఎంట్రన్స్ ఫామ్ ఫిలప్ చేసి అర్హులైన పేద విద్యార్థులు సొసైటీలోని ఫౌండేషన్ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఈ సమావేశంలో బి.దశరథ రామిరెడ్డి,ఎన్ బాలకృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ




గూడూరు(సింధూరదర్శిని) 18జూన్ నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండలం కడివేడు గ్రామం నందు ఉన్న ప్రాథమిక పాఠశాలలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్,పలకలు,ఇతర విద్యా సామాగ్రిని అందజేయడం జరిగింది. క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు కుమ్మరి వీధిలోని మహాలక్ష్మి జువెలరీ అధినేత, రోటేరియన్ ఎస్ ఎల్ ఎన్ బాబు దాతృత్వంతో కడివేడు లోని పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కు పలకలు, ఇతర విద్యాసామాగ్రిని అందజేయడం చాలా సంతోషమని, రోటరీ వెస్ట్ క్లబ్ విద్య, వైద్యం మీద ఎక్కువ సేవా కార్యక్రమాలు చేస్తుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాఘవరెడ్డి, వాసుగౌడ్, దాత బాబు, సనత్‌రెడ్డి, ఆడిటర్ రామ్మోహన్రావు, కోటకృష్ణ, నెలకాస్ట్ రవీందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, బలరామిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలి

## కంకణాల పెంచలనాయుడు



గూడూరు( సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో గూడూరు ను జిల్లా కేంద్రంగా చేయాలని జరుగుతున్న శిబిరం 200వ రోజుకు చేరుకుంది ప్రజల ఆకాంక్ష నెరవేరాలని హోమపూజ కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు కంకణాల పెంచలనాయుడు మాట్లాడుతూ గూడూరు జిల్లా కేంద్రంగా అవడానికి అన్ని వనరులు ఉన్నాయని భవిష్యత్ తరాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం వెంటనే గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలని కోరారు.

# పిల్లలకు పలకల పంపిణీ

గూడూరు (సింధూరదర్శిని) 18 జూన్ నెల్లూరుజిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని పాలిచెర్ల వారి పాళెం ప్రాథమిక పాఠశాలలో గురువారం పలకల పంపిణీ చేశారు.ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా ఒకటవ తరగతి చేరిన పిల్లలకు రిటైర్డ్ ఎస్.ఐ అట్ల చెంచయ్య జ్ఞాపకార్థం కుమార్తె చెంచమ్మ పలకలను పిల్లలకు బహుకరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభన్‌బాబు, ఉపాధ్యాయులు రాజశేఖర్, మాధవీ లత, చెంచమ్మతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఛలో విజయవాడను జయప్రదం చేయండి

### ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్



గూడూరు (సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; దీర్ఘకాలికంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జూలై 7న ఏ. ఐ.టి. యు సి అనుబంధ సంఘాలు అధ్వర్యంలో జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏ. ఐ.టి. యు.సి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ లు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం గోపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తక్కువ జీతాలకు పని చేస్తున్నారని గతంలో జీతాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఇంతవరకు హామీని నెరవేర్చలేదన్నారు. కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని నెల అంతా పని కల్పించాలన్నారు. ఖాళీల భర్తీల్లో వీరికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి 21 వేలు జీతం చెల్లించాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు ప్రతి నెల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 36 ప్రకారం 24,500 జీతం చెల్లించాలన్నారు. 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన జీతం చెల్లించాలని పేర్కొన్నారు. గ్రాట్యుటీ చెల్లింపు, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. సిక్, డెత్, రిటైర్మెంట్ అయిన వారు స్థానాల్లో పిల్లలకు ఉద్యోగాలవాలన్నారు. పట్టణ విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచి, పనిచేస్తున్న వారిపై పనిభారం తగ్గించాలి అన్నారు. అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు కేటాయించాలన్నారు. ప్రతి ఒక్కరు జూలై 7 న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాఘవులు, కృష్ణ, షర్మిల, సంపూర్ణమ్మ, యాకోబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైమరీ స్కూల్ పిల్లలకు విద్యా సామాగ్రి పంపిణీ

### ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌రావు



గూడూరు (సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా; ప్రైమరీ స్కూల్ పిల్లలకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని శివాలయం పక్కన ఉన్న మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో గురువారం హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యదర్శి చిలకల మీరయ్య, కార్తికేయ ఆన్లైన్ సర్వీస్ వారి సహకారంతో స్కూల్ పిల్లలకు డి ఆర్ డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా విద్యా సామాగ్రి బుక్స్, పెన్స్, పలకలు,పెన్సిల్‌లు ,వాటర్ బాటిల్‌లు, స్నాక్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాన్వెంట్లకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు

గూడూరు (సింధూరదర్శిని) 18 జూన్ నెల్లూరుజిల్లా; చిన్నారులకు కాన్వెంట్లకు దీటుగా ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నట్లు ఐ సిడిఎస్ సిడిపిఓ షేక్. మెహబూబి ఆదేశాల మేరకు గురువారం చిల్లకూరు సెక్టార్‌లోని నక్కల కాల్వ కండ్రిగ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి పిలుస్తుంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ ప్రైవేట్ కాన్వెంట్లకు దీటుగా అంగన్వాడీలలో చిన్నారులకు అనుగుణంగా మానసిక - వికాసం - ఉల్లాసం ఆటపాటలతో విద్యా లక్ష్యంగా శిక్షణ పొందిన వర్కర్లచే బోధన ఉంటుందన్నారు. మూడు సంవత్సరాల నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడీలో చేర్పించాలన్నారు. అంతేకాకుండా అంగన్వాడీలలో పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులతో సమావేశం అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.







# కర్ణాటక ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

రేణిగుంట ( సింధూరదర్శిని) 18 జూన్ తిరుపతి జిల్లా; తిరుపతి, తిరుమల పర్యటనలో భాగంగా గురువారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కి రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి, మాజీ ఎంపీ చింతామోహన్, నాయకులు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు, ఎయిర్పోర్ట్ అధికారులు, కర్ణాటక ముఖ్యమంత్రి డీ కే శివకుమార్ కి స్వాగతం పలికారు.





# అర్బన్ డెవలప్మెంట్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి



### జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి( సింధూర దర్శిని) 18 జూన్ తిరుపతి జిల్లా ; తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు.గురువారం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో తుడా బోర్డు సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, తుడా చైర్మన్ సి దివాకర్ రెడ్డి, తుడా వైస్ చైర్మన్ ఆర్ గోవిందరావు తో కలిసి పాల్గొని అజెండాలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లా కలెక్టర్ తుడా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తుడా పరిధిలో అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బోర్డు సమావేశంలో తుడా పరిధిలోని గల సూరప్పకసం గ్రామం వద్ద పద్మావతి నగర్ లేఔట్ విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, కన్వెన్షన్ హాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమోదించారు. తుడా పరిధిలో గల తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దేవాలయముకు వెళ్ళు మార్గం వరకు గల ప్రాంతాల అభివృద్ధి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పన ట్రాఫిక్ రద్దీ తగ్గింపు కొరకు మాస్టర్ నిర్మాణం కొరకు ఆమోదించడం జరిగింది. సెట్టిపల్లి టౌన్షిప్ కు మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మాణం కొరకు ఆమోదం పొందినారు. నాయుడుపేట ఇంటర్నల్ డ్రైన్స్ నిర్మించుటకు ఆమోదం తెలిపారు. తిరుపతి సరస్సులు మరియు చెరువుల నగరంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తుడా పరిధిలో వాతావరణ మార్పులు తట్టుకోగల సమీకృత నీటి నిర్వహణ అనే పేరుతో ఒక సమగ్ర ప్రాజెక్టును రూపొందించడం జరిగింది ఆమోదం పొందారు. మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.అలాగే తుడా పరిధిలో చేపట్టనున్న కొత్త అభివృద్ధి ప్రాజెక్టుల ప్రతిపాదనలను పరిశీలించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తుడా చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని చేపట్టే సూరప్పకసం లేఔట్ లో వివిధ నిర్మాణ పనులు , పద్మావతి నగర్ లేఔట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ వారు లేఔట్ నందు కన్వెన్షన్ హాలు తదితర సౌకర్యాల పనులు పూర్తి కావాలనీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు , తుడా ఎస్ ఈ రవీంద్ర, సి పి ఓ దేవి కుమార్,అధికారులు, వివిధ శాఖల అధికారులు మరియు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# అధికారులతో డెడికేటెడ్ కమిషన్ సమీక్షా సమావేశం

### జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా - బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి వినతిపత్రాల స్వీకరణ

నెల్లూరు (సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు డెడికేటెడ్ కమిషన్ కృషి చేస్తోందని ఆ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా గురువారం నెల్లూరులో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారుల నుంచి జిల్లాలోని బీసీ జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. బీసీలకు సంబంధించిన గణాంకాలు, రికార్డులు, ఇతర సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేసి కమిషన్‌కు అందజేయాలని అధికారులకు సూచించారు. అనంతరం వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకుల నుంచి రాజీవ్ రంజన్ మిశ్రా వారి అభిప్రాయాలు, సూచనలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.




ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు వివిధ అంశాలపై వినతిపత్రాలను కమిషన్ చైర్మన్‌కు అందజేశారు.గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రజలు, సంఘాల ప్రతినిధుల నుంచి అందుతున్న సూచనలు, వినతులను పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, కమిషనర్ నందన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, జడ్పీ సీఈవో శ్రీధర్ రెడ్డి, డీపీవో వసుమతి, డీఈవో ఆర్. బాలాజీ రావు, జిల్లాస్థాయి అధికారులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి 5లక్షల బీమా చెక్కు

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

## కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశంపార్టీ ధ్యేయం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



నెల్లూరు (సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; కార్యకర్త కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఓ తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటంబానికి రూ. 5లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ ఆయిషా అనే మహిళ ఈ ఏడాది మార్చి 16న కోవూరు సమీపంలో ఆటోలో ప్రయాణిస్తుండగా జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ మంజూరు చేసిన రూ. 5లక్షల ప్రమాద బీమాను మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్నప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ఆదుకుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉన్నారు.

# ప్రణాళికాబద్ధంగా రొట్టెల పండుగ: మేయర్ దేవరకొండ సుజాతఅశోక్



నెల్లూరు (సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర పండుగగా గుర్తింపు తెచ్చుకున్న నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఈ ఏడాది నిర్వహణను అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్వహించనున్నామని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ ప్రకటించారు. ఈనెల 26వ తేదీ నుంచి ఐదు రోజులపాటు జరగనున్న బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఏర్పాటు పనులను నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులతో కలిసి మేయర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో కనీవినీ ఎరుగని రీతిలో బారాషాహీద్ దర్గా ప్రాంగణం అంతా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకొని పండుగను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.
పండుగ సందర్భంగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం గుడ్డ సంచులు, కాగితపు సంచులు ఇతర పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. ప్రజలందరూ ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన రొట్టెల పండుగ నిర్వహణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భక్తుల సౌకర్యార్థం పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పండుగకు విచ్చేసే ప్రతి భక్తుడు పరిశుభ్రతను పాటిస్తూ నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ దినేష్, ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ శేషగిరిరావు, సిటీప్లానర్ రఘునాధరావు, శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిందితుడికి 7ఏళ్ళ కఠిన కారాగార శిక్ష

## కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సమర్థవంతమైన పర్యవేక్షణతో శిక్ష ఖరారు

నెల్లూరు (సింధూర దర్శిని) 18 జూన్ నెల్లూరు జిల్లా; జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ద్వారా కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించడం వల్ల మరో కీలక కేసులో నిందితుడికి శిక్ష పడింది. అల్లూరు సుబ్బారెడ్డి పాలెం ఏ ఎస్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం. 76/2018, సెక్షన్ 307 ఐపిసి కేసులో నెల్లూరులోని 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు (SC No.70/2022) గురువారం తీర్పు వెలువరించింది. కేసు వివరాల ప్రకారం, 09.05.2018 తేదీన దుబగుంట గ్రామానికి చెందిన నిందితుడు చల్లా లక్ష్మీనారాయణ తనపై కోడి దొంగతనం చేశాడని గ్రామంలో ప్రచారం చేసిందనే కక్షతో అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు చల్లా వెంకట నారాయణమ్మ పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు మొదట ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో, అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని సింహపురి ఆసుపత్రిలో చికిత్స పొందింది. బాధితురాలు వాంగ్మూలం ఇవ్వలేని పరిస్థితిలో ఉండటంతో ఆమె కోడలు చల్లా అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడింది. ఈ కేసును దర్యాప్తు చేసిన అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ పి. వీర నారాయణ పకడ్బందీగా సాక్ష్యాధారాలను సేకరించి చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం కోర్టు విచారణలో ప్రాసిక్యూషన్ తరపున సమర్పించిన సాక్ష్యాధారాలు, వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు న్యాయమూర్తి ఎ. నాగశైలజ నిందితుడికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో శిక్ష పడేందుకు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. బ్రహ్మయ్య, కోర్టు లైజన్ అధికారి హెచ్‌సీ పి. సుధాకర్, సి ఎం ఎస్ ఇన్‌చార్జి ఎస్ఐ కె. సుమన్, దర్యాప్తు అధికారి మరియు కేసు విచారణలో భాగమైన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల అభినందించారు. జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ముఖ్యమైన కేసులను నిరంతరం పర్యవేక్షిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా, నేరస్థులకు చట్టపరమైన శిక్షలు పడేలా సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీసుశాఖ వెల్లడించింది.

# జిల్లాలో నేరాల నియంత్రణలో గణనీయ పురోగతి

## శాంతిభద్రతల పరిరక్షణలో నాయకుల, ప్రజల సహకారం

## అభినందనీయం: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



కడప, సింధూరదర్శిని: గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో వైఎస్ఆర్ కడప జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలోనూ గణనీయమైన పురోగతి సాధించామని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా.. గురువారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్ లో ఘనంగా ప్రారంభం అయిన “రాష్ట్రంలో రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం” విజయోత్సవ సభలో జిల్లా ఎస్పీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమర్థవంతమైన చర్యలు చేపట్టడంతో పలు రకాల నేరాల శాతం తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు యంత్రాంగం మధ్య సత్సంబంధాలు నెలకొనడం వల్ల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతోందన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజల సంక్షేమం, భద్రతే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, మహిళా హెల్ప్‌డెస్క్‌లు, షీ టీమ్స్, సైబర్ అవగాహన కార్యక్రమాల ద్వారా రక్షణ చర్యలను మరింత బలోపేతం చేశామని ఎస్పీ తెలిపారు. బాలల రక్షణ, మహిళలపై నేరాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. అక్రమ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వివరించారు. ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని చెప్పారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసు శాఖకు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్న ఎస్పీ, భవిష్యత్తులో కూడా ప్రజల భాగస్వామ్యంతో మరింత మెరుగైన పోలీసింగ్ అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూ

- -తిరుపతిలో జేఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆఫ్-క్యాంపస్ ఏర్పాటు
- -మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం
- -74 కోర్సులతో 10 వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత విద్య
- -ప్రాజెక్టు ద్వారా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన
- -ప్రతిష్ఠాత్మక నాక్ ఏం గుర్తింపు పొందిన జేఎస్ఎస్ విద్యాసంస్థ


అమరావతి, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంలో విద్యా రంగం అభివృద్ధికి కీలక అడుగు పడింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రానుంది. మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న జగద్గురు శ్రీశివరాత్రీశ్వర (జేఎస్ఎస్) మహావిద్యాపీఠం, తమ ఆఫ్-క్యాంపస్‌ను తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో అమరావతిలో ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎస్ఎస్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది.
ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ ప్రో ఛాన్స్‌లర్ డా. బి. సురేష్ సంతకాలు చేసి మార్చుకున్నారు. 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన జేఎస్ఎస్ విద్యాసంస్థకు భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయి. మైసూరు కేంద్రంగా ఉన్న జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, నాక్ నుంచి ‘ఎ++’ గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయం. ప్రతిష్ఠాత్మక ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానంలో, ఓవరాల్‌గా 38వ స్థానంలో నిలిచి తన నాణ్యతను చాటుకుంది.

**10 వేల మంది విద్యార్థులకు అవకాశం**

ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటుచేస్తారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ విభాగాల్లో మొత్తం 74కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. క్యాంపస్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాక, 10 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. వీటికి అదనంగా హెల్త్‌కేర్‌లో ఏఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా నెలకొల్పనున్నారు.

**20 వేల ఉద్యోగాలు.. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా..**

ఈ ఒప్పందం ప్రకారం, తిరుపతిలో క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, చట్టబద్ధమైన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్-విండో విధానాన్ని కల్పిస్తుంది. క్యాంపస్ నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని జేఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఇది స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను అందిస్తుంది. ఈ కార్యక్రమంలో జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ రిజిస్ట్రార్ డా. బి. మంజునాథ, డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కేపీఎంపీ అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్. రాఘవన్ పాల్గొన్నారు.






# వదంతులు నమ్మొద్దు, ప్రశాంతంగా ఉండండి

నీట్ రీఎగ్జామ్ రాయబోతున్న విద్యార్థులకు ఎన్టీయే సూచన

జూన్ 21న నీట్ యూజీ రీ-ఎగ్జామ్ యథాతథం

వదంతులు నమ్మొద్దు, ప్రశాంతంగా ఉండాలంటూ విద్యార్థులకు ఎన్టీఏ సూచన

పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశామని వెల్లడి

మానసిక ఒత్తిడికి గురైతే 'మానస్' హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని పిలుపు

నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌కు మరో మూడు రోజులే సమయం ఉన్న నేపథ్యంలో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అభ్యర్థులకు కీలక సూచనలు చేసింది. జూన్ 21 (ఆదివారం) జరగనున్న ఈ పరీక్షకు ప్రశాంతంగా సిద్ధం కావాలని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్టీఏ 'ఎక్స్' వేదికగా విద్యార్థులకు భరోసానిస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేసింది. "మీరు ఎంతో కష్టపడి సిద్ధమయ్యారు. ఇప్పుడు మీ శ్రమపై నమ్మకం ఉంచాల్సిన సమయం వచ్చింది. ఆందోళన చెందకుండా, తగినంత విశ్రాంతి తీసుకుని పరీక్షలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చండి" అని పేర్కొంది. మే 3న జరిగిన పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో నీట్ యూజీ-2026 పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ప్రతిభావంతులైన విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్టీఏ పునరుద్ఘాటించింది. పరీక్షల పారదర్శక నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అభ్యర్థులు అధికారిక సమాచారం కోసం ఎన్టీఏ వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని సూచించింది. పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థుల కోసం 'మానస్' (14416) మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ఎన్టీఏ సూచించింది. "ఒత్తిడికి లోనవుతుంటే మీరు ఒంటరి వారని భావించకండి. సహాయం కోరడం బలహీనత కాదు, అది మీ బలానికి నిదర్శనం" అని పేర్కొంది. నిర్ధారణ లేని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా కోరింది.

# లాభాల్లో ముగిసిన సూచీలు...


పీఎస్‌యూ బ్యాంకులు, హెల్త్‌కేర్ షేర్ల జోరు

254 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 82 పాయింట్ల లాభంతో నిఫ్టీ

ఐటీ రంగం షేర్లలో అమ్మకాల ఒత్తిడి, సూచీ 1.19 శాతం నష్టం

లాభాల్లోనే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు

డాలర్‌తో పోలిస్తే 16 పైసలు బలపడిన రూపాయి



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో కీలక సూచీలు నష్టాల నుంచి కోలుకున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌యూ), హెల్త్‌కేర్, రియల్టీ షేర్లకు బలమైన కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే, ఐటీ రంగంలో చోటుచేసుకున్న అమ్మకాల ఒత్తిడి మార్కెట్ లాభాలను కొంతమేర పరిమితం చేసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు (0.33 శాతం) పెరిగి 77,409.98 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 82.30 పాయింట్లు (0.34 శాతం) లాభపడి 24,168.00 వద్ద ముగిసింది. రంగాల వారీగా పరిశీలిస్తే, నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్ దాదాపు ఒక శాతం మేర పుంజుకోగా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ సూచీలు కూడా గణనీయమైన లాభాలను నమోదు చేశాయి. దీనికి విరుద్ధంగా, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.19 శాతం నష్టపోయి అత్యంత బలహీనంగా నిలిచింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి కీలక షేర్లు సూచీల లాభాలకు బాసటగా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల ధోరణి కనిపించగా, నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం లాభాల్లో ముగిశాయి. సాంకేతికంగా నిఫ్టీకి 24,200 స్థాయి వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని అధిగమిస్తే 24,400 వరకు వెళ్లే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దిగువన 24,000 స్థాయి కీలక మద్దతుగా పనిచేస్తుందని, ఒకవేళ ఆ స్థాయిని కోల్పోతే లాభాల స్వీకరణ చోటుచేసుకోవచ్చని భావిస్తున్నారు. మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుసగా ఐదో రోజు బలపడి 94.32 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 16 పైసలు మెరుగుపడింది.

# రూ.వేలు ఖర్చు పెట్టాల్సిన పని లేదు..

రోజూ తినే ఈ ఆహారాల్లోనే ఉంది మంచి ప్రొటీన్ - -జామపండులో గణనీయ ప్రొటీన్

శాకాహారులకు బఠానీ మంచి ఎంపిక - మినప్పప్పు పోషకాలతో నిండిన ఆహారం

శనగపిండిలో కూడా ప్రొటీన్ మోతాదు ఎక్కువే -గుమ్మడి గింజలు, వేరుశెనగలు పోషక విలువలు కలిగిన ఆహారాలు



ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న కొద్దీ ప్రొటీన్ గురించి చర్చ కూడా ఎక్కువవుతోంది. శరీర ఎదుగుదల, కండరాల బలం, రోజువారీ శక్తి కోసం ప్రొటీన్ కీలకమని వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రొటీన్ అంటే చాలామందికి గుడ్లు, చికెన్, చేపలు లేదా ఖరీదైన సప్లిమెంట్లే గుర్తుకొస్తాయి. దీంతో శాకాహారులు తమకు సరిపడా ప్రొటీన్ అందదేమోనని ఆందోళన చెందుతుంటారు. కానీ నిపుణుల అభిప్రాయం మాత్రం భిన్నంగా ఉంది. రోజూ మన ఇళ్లలో వాడే కొన్ని సాధారణ ఆహార పదార్థాల్లోనే మంచి మోతాదులో ప్రొటీన్ దొరుకుతుందని చెబుతున్నారు. పండ్లలో జామపండు ఈ జాబితాలో ముందుగా చెప్పుకోవాల్సినది. సాధారణంగా జామను విటమిన్-సి కోసం తింటారు. కానీ ఇందులో ప్రొటీన్ కూడా గణనీయంగా ఉంటుంది. మార్కెట్‌లో తక్కువ ధరకు దొరికే ఈ పండు పోషకాల పరంగా మాత్రం చాలా విలువైనదిగా భావిస్తారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సులభంగా తినగలిగే ఆహారం కావడం మరో ప్రత్యేకత. కూరగాయల విషయానికి వస్తే బఠానీ మంచి ప్రొటీన్ మూలంగా గుర్తింపు పొందింది. కూరల్లో, పలావ్‌లలో, స్నాక్స్‌లో తరచూ ఉపయోగించే బఠానీ శరీరానికి ప్రొటీన్‌తో పాటు పీచుపదార్థాన్ని కూడా అందిస్తుంది. అందుకే శాకాహారం తీసుకునేవారు దీన్ని తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. మన వంటింట్లో ఎప్పుడూ కనిపించే మినప్పప్పు కూడా ప్రొటీన్‌కు మంచి వనరు. ఇడ్లీ, దోశ, వడ వంటి వంటకాల ద్వారా ఇది దాదాపు ప్రతి ఇంట్లో ఆహారంలో చేరుతోంది. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో మినప్పప్పు కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. శనగపిండిలో కూడా ప్రొటీన్ మోతాదు ఎక్కువగానే ఉంటుంది.

పకోడీలు, చిల్లాలు, ఇతర పిండివంటల రూపంలో ఇది చాలా ఇళ్లలో వాడుతుంటారు. రుచితో పాటు పోషక విలువలు కూడా ఉండటంతో శనగపిండిని ఆరోగ్యకరమైన ఆహారంగా పరిగణిస్తారు. ప్రొటీన్ గురించి మాట్లాడేటప్పుడు గుమ్మడి గింజలు, పల్లీలనూ మర్చిపోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. గుమ్మడి గింజల్లో ప్రొటీన్‌తో పాటు ఇతర పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. వేరుశెనగలు అయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారాల్లో ఒకటిగా గుర్తింపు పొందాయి. వీటిని నేరుగా తినొచ్చు. లేకపోతే ఇతర వంటకాలతో కలిపి తీసుకోవచ్చు. అయితే ఒక్క ఆహారం మీదే ఆధారపడకుండా సమతుల ఆహారం తీసుకోవడం ముఖ్యం. ప్రొటీన్‌తో పాటు విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలు కూడా శరీరానికి అవసరమే. అందుకే రోజువారీ ఆహారంలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# 400 ఏళ్లైనా చెక్కు చెదరని చెక్క రాజభవనం.. ఎక్కడుందో తెలుసా?

కన్యాకుమారి జిల్లాలో పద్మనాభపురం రాజభవనం - 1601లో నిర్మించిన చారిత్రక కట్టడం

పూర్తిగా చెక్కతో నిర్మించిన భారతదేశంలోని అతిపెద్ద రాజభవనాల్లో ఒకటి - ఒకప్పుడు ట్రావెన్‌కోర్ రాజ్యానికి పరిపాలనా కేంద్రం

చెక్క శిల్పాలు, మెరిసే నల్లటి నేల, గడియార గోపురం ప్రత్యేక ఆకర్షణలు



భారతదేశంలోని రాజభవనాల గురించి మాట్లాడితే చాలామందికి పాలరాతితో నిర్మించిన భారీ కట్టడాలు, ఎత్తైన రాతి కోటలే గుర్తుకొస్తాయి. అయితే దక్షిణాదిలో మాత్రం వీటికి పూర్తిగా భిన్నమైన ఓ అద్భుత రాజభవనం ఉంది. నాలుగు శతాబ్దాల చరిత్రను మోస్తున్న ఈ కట్టడాన్ని పూర్తిగా చెక్కతో నిర్మించారు. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాలో ఉన్న ఈ రాజభవనం పేరు పద్మనాభపురం ప్యాలెస్. 1601లో నిర్మించిన ఈ రాజభవనం ఒకప్పుడు ట్రావెన్‌కోర్ రాజ్యానికి పరిపాలనా కేంద్రంగా ఉండేది. 1795లో రాజధానిని తిరువనంతపురానికి మార్చే వరకు ఇక్కడి నుంచే పాలన సాగింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ రాజభవనం తమిళనాడులో ఉన్నప్పటికీ ప్రస్తుతం దీని నిర్వహణను కేరళ పురావస్తు శాఖ చూస్తోంది. ఈ రాజభవనాన్ని ప్రత్యేకంగా నిలబెట్టేది దీని నిర్మాణ శైలి. రాయి, సిమెంట్‌కు బదులుగా చెక్కతో నిర్మించిన ఈ భవనంలో వాలుగా ఉండే పైకప్పులు, అద్భుతమైన చెక్క శిల్పాలు, విశాలమైన ప్రాంగణాలు కనిపిస్తాయి. ఆధునిక ఎయిర్ కండిషనర్లు లేని కాలంలోనే సహజ గాలి ప్రసరణ జరిగేలా దీన్ని రూపొందించారు. అందుకే ఎండాకాలంలోనూ లోపలి గదులు చల్లగా ఉంటాయి. ఈ రాజభవనంలో అత్యంత ఆసక్తికరమైన అంశాల్లో ఒకటి... నేల! వందల ఏళ్ల క్రితం నిర్మించినప్పటికీ నల్లటి నేల ఇప్పటికీ మెరుస్తూనే ఉంటుంది. బొగ్గు, కాల్చిన కొబ్బరి చిప్పలు, సున్నం, కొన్ని సహజ పదార్థాల మిశ్రమంతో దీనిని తయారు చేశారని చరిత్రకారులు భావిస్తున్నారు. అయితే కచ్చితమైన రహస్యం మాత్రం ఇప్పటికీ తెలియలేదు. రాజభవనంలోని 'తాయి కొట్టారం' లేదా 'రాజమాత' నివాసం అత్యంత పురాతన భాగంగా గుర్తింపు పొందింది. ఇక్కడ కనిపించే చెక్క శిల్పాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. అలాగే రాజులు కీలక నిర్ణయాలు తీసుకునే 'మంత్రశాల' కూడా ప్రత్యేక ఆకర్షణ. ఈ గదిలోని కిటికీలను ఎండ లోపలికి రాకుండా, గాలి మాత్రం సులభంగా ప్రవహించేలా రూపొందించడం అప్పటి శిల్పుల ప్రతిభకు నిదర్శనం. అంతేకాదు, విశాలమైన భోజనశాల, ప్రాచీన కుడ్యచిత్రాలు, రాజవంశానికి చెందిన వస్తువులు, ఇప్పటికీ పనిచేస్తున్న పురాతన గడియార గోపురం కూడా ఇక్కడి ప్రత్యేకతలు.

చరిత్ర, సంస్కృతి, శిల్పకళలపై ఆసక్తి ఉన్నవారికి పద్మనాభపురం రాజభవనం ఓ అరుదైన అనుభూతిని అందిస్తుంది. నాలుగు శతాబ్దాల క్రితం దక్షిణాది రాజుల జీవనశైలిని కళ్లకు కట్టినట్లు చూపించే ఈ చెక్క రాజభవనం నిజంగా ఓ చారిత్రక అద్భుతమే.

# కుట్టగానే తేనెటీగ ఎందుకు చనిపోతుంది? ప్రకృతి రాసిన త్యాగగాథ ఇదీ!



పాము బతికి ఉంటే ఎన్ని సార్లైనా కాటేయగలదు. తేలు కూడా అంతే. కానీ తేనెటీగ మాత్రం ఒక్కసారి మనిషిని కుడితే ప్రాణాన్ని కోల్పోతుంది. ప్రకృతిలోని అత్యంత ఆశ్చర్యకరమైన విషయాల్లో ఇదొకటి. శత్రువును గాయపరచడం కోసం తన ప్రాణాన్నే పణంగా పెట్టే ఈ వ్యవస్థ వెనుక ఆసక్తికరమైన శాస్త్రీయ కారణం ఉంది.
తేనెటీగ శరీరంలోని ముల్లు (స్టింగర్) సాధారణ సూదిలా ఉండదు. దానిపై కంటికి కనిపించని చిన్న కొక్కేలు ఉంటాయి. ఇవి చేపల గాలంలా వెనక్కి తిరిగి ఉంటాయి. తేనెటీగ మరో పురుగును కుట్టినప్పుడు పెద్దగా సమస్య ఉండదు. కానీ మనిషి లేదా మందమైన చర్మం ఉన్న ఇతర జంతువులను కుట్టినప్పుడు ఈ కొక్కేలు చర్మంలో బలంగా ఇరుక్కుపోతాయి. కుట్టిన తర్వాత తేనెటీగ ఎగిరిపోవడానికి ప్రయత్నిస్తుంది. అయితే ముల్లు బయటకు రాదు. అయినా తేనెటీగ అలాగే బలంగా లాగుతుంది. దీంతో ముల్లుతో పాటు విష సంచి, కండరాలు, పొట్ట భాగంలోని కొన్ని అంతర్గత అవయవాలు శరీరం నుంచి విడిపోతాయి. దీంతో తేనెటీగకు తీవ్ర గాయాలు అవుతాయి. కొద్ది నిమిషాలు లేదా గంటల్లోనే అది మరణిస్తుంది. అయితే ప్రకృతి ఎందుకు ఇలాంటి లోపభూయిష్టమైన ఆయుధాన్ని తేనెటీగకు ఇచ్చింది? దీనికి సమాధానం వాటి జీవన విధానంలో దాగి ఉంది. తేనెటీగలు ఒంటరిగా జీవించవు. వేల సంఖ్యలో కాలనీలుగా జీవిస్తాయి. ఒక వర్కర్ తేనెటీగ ప్రాణం కంటే మొత్తం గూడు భద్రతే వాటికి ముఖ్యమైనది. గూడుపై దాడి చేసే శత్రువును అడ్డుకునేందుకు ఒక తేనెటీగ చనిపోయినా, వేలాది తేనెటీగలు, ముఖ్యంగా రాణి తేనెటీగ సురక్షితంగా ఉంటే కాలనీ మనుగడ కొనసాగుతుంది. అందుకే శాస్త్రవేత్తలు దీనిని 'స్వీయ త్యాగ రక్షణ వ్యవస్థ'గా అభివర్ణిస్తారు. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. తేనెటీగ ఎగిరిపోయిన తర్వాత కూడా చర్మంలో మిగిలిపోయిన ముల్లు కొంతసేపు విషాన్ని విడుదల చేస్తూనే ఉంటుంది. అందుకే తేనెటీగ కుట్టిన వెంటనే ముల్లును జాగ్రత్తగా తొలగించాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అన్ని తేనెటీగలు ఇలా చనిపోవు. తేనె తయారు చేసే హనీ బీస్‌లో ఈ లక్షణం ఎక్కువగా కనిపిస్తుంది. చాలా ఇతర తేనెటీగ జాతులు, కందిరీగలు పలుసార్లు కుట్టినా బతికే ఉంటాయి. వాటి ముళ్లు అంతగా ఇరుక్కుపోవు.

# ఇషాన్ ప్రత్యేకత అదే.. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ స్వాన్ ప్రశంసలు

ఆఫ్ఘన్‌పై రెండో వన్డేలో సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్ - 79 బంతుల్లో 125 పరుగులు.. 14 ఫోర్లు, 7 సిక్సర్లతో వీరవిహారం

శుభ్‌మన్ గిల్‌తో కలిసి 224 పరుగుల భాగస్వామ్యం - జట్టులో ఏ పాత్ర ఇచ్చినా పోషిస్తాడన్న గ్రేమ్ స్వాన్

అసలు గ్యాప్ లేనట్లు ఆడాడని ప్రశంస - బలహీనతను బలంగా మార్చుకున్నాడని వ్యాఖ్య




ఆఫ్ఘనిస్థాన్‌తో లక్నో వేదికగా జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్ ఆడిన అద్భుత ఇన్నింగ్స్‌పై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ ప్రశంసలు కురిపించాడు. జట్టులోకి పునరాగమనం చేసినా.. అసలు ఏమాత్రం గ్యాప్ లేదన్నట్లుగా ఆడిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కేవలం 79 బంతుల్లోనే 125 పరుగులు చేసి భారత భారీ విజయానికి పునాది వేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154)తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఆఫ్ఘన్ బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టాడు. జియోస్టార్‌తో మాట్లాడిన స్వాన్.. ఇషాన్ జట్టుకు అవసరమైన పాత్రను ఎలాంటి అభ్యంతరం లేకుండా పోషిస్తాడని చెప్పాడు. “అతడికి ఏ బాధ్యత అప్పగించినా అంగీకరిస్తాడు. తిరిగి జట్టులోకి వచ్చి ఇంత ప్రభావం చూపడం నిజంగా గొప్ప విషయం” అని వ్యాఖ్యానించాడు. ఇషాన్ ఇన్నింగ్స్ నిర్మించిన తీరు తనను మరింత ఆకట్టుకుందని స్వాన్ తెలిపాడు. తొలి అర్ధశతకాన్ని ఓపిగ్గా ఆడిన అతడు తర్వాత కేవలం 19 బంతుల్లోనే మరో 50 పరుగులు చేసి సెంచరీ పూర్తి చేయడం అసాధారణమని అన్నాడు. అయితే అవి నిర్లక్ష్యంగా కొట్టిన షాట్లు కాదని, బౌలర్లపై ఒత్తిడి పెంచుతూ సరైన బంతులను మాత్రమే బౌండరీలకు తరలించాడని వివరించాడు. తన బలహీనతలపై ఇషాన్ కష్టపడి పనిచేసి వాటినే బలంగా మార్చుకున్నాడని స్వాన్ ప్రశంసించాడు. అదే అతణ్ని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని పేర్కొన్నాడు.

ఇషాన్-గిల్ జోడీ చెలరేగడంతో భారత్ 402 పరుగుల భారీ స్కోరు సాధించిన విషయం తెలిసిందే. అనంతరం భారత బౌలర్లు ఆఫ్ఘనిస్థాన్‌ను 232 పరుగులకే ఆలౌట్ చేసి 170 పరుగుల తేడాతో విజయం సాధించారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది.

# ప్రతి హార్ట్ పేషెంట్‌కు స్టెంట్ వేయాల్సిన అవసరం లేదు!

స్టెంట్లు, బైపాస్ సర్జరీ సాధ్యం కాని గుండె రోగులకు ఈఈసీపీ ఒక ప్రత్యామ్నాయ చికిత్స

శరీరంలో సహజంగానే కొత్త రక్తనాళాలు ఏర్పడటానికి ఈ థెరపీ సహాయం

శస్త్రచికిత్స లేకుండా కాళ్లకు కఫ్స్ బిగించి చికిత్స

ఇది ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సురక్షితమైన చికిత్సా విధానం

ఛాతీ నొప్పి తగ్గి, గుండె పనితీరు మెరుగుపడే అవకాశం



గుండె జబ్బులతో బాధపడుతూ, స్టెంట్లు వేయడం లేదా బైపాస్ సర్జరీ చేయడం సాధ్యపడని రోగులలో ‘ఎన్‌హాన్స్‌డ్ ఎక్స్‌టర్నల్ కౌంటర్‌పల్సేషన్’ (ఈఈసీపీ) థెరపీ కొత్త ఆశలు చిగురింపజేస్తోంది. శస్త్రచికిత్స అవసరం లేని ఈ విధానం ద్వారా గుండెకు రక్త ప్రసరణను మెరుగుపరిచి, శరీరంలో సహజంగానే కొత్త రక్తనాళాలు (సహజ బైపాస్‌లు) ఏర్పడేలా ప్రోత్సహించవచ్చని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం... తీవ్రమైన గుండెనొప్పితో బాధపడే రోగులకు ఈ చికిత్స ఒక వరమని చెప్పవచ్చు. సరైన మందులు, చికిత్సలు తీసుకున్నప్పటికీ ఛాతీ నొప్పి తగ్గని రోగులు ఎందరో ఉన్నారని బెంగళూరులోని ఆస్టర్ ఆర్వీ ఆసుపత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి. డింపు ఎడ్విన్ జోనాథన్ తెలిపారు. స్టెంట్లు లేదా శస్త్రచికిత్సలు నిర్వహించడానికి వీలులేని క్లిష్ట పరిస్థితుల్లో ఉన్ రోగులకు ఈఈసీపీ ఒక ప్రభావవంతమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

### చికిత్స ఎలా పనిచేస్తుంది?

ఈఈసీపీ ప్రక్రియలో రోగి కాళ్లు, పిరుదుల భాగానికి ప్రత్యేకమైన కఫ్స్‌ను అమర్చి, వాటిని ఈసీజీ యంత్రానికి అనుసంధానిస్తారు. గుండె విశ్రాంతి తీసుకునే సమయంలో ఈ కఫ్స్ గాలితో నిండి, కాళ్ల నుంచి గుండెకు రక్త ప్రసరణను వేగవంతం చేస్తాయి. తిరిగి గుండె కొట్టుకునే సమయంలో ఆ గాలిని విడుదల చేయడం ద్వారా గుండెపై పని భారాన్ని తగ్గిస్తాయి. ఈ చికిత్సను ఏడు వారాల పాటు, వారానికి ఐదు రోజులు, రోజుకు ఒక గంట చొప్పున మొత్తం 35 సెషన్ల పాటు నిర్వహిస్తారు.

ఈ ప్రక్రియ వల్ల మూసుకుపోయిన ధమనుల చుట్టూ కొత్త రక్తనాళాలు అభివృద్ధి చెందుతాయని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ వంటి అంతర్జాతీయ వైద్య సంస్థలు వెల్లడించాయి. ఈ చికిత్స పొందిన సుమారు 30 నుంచి 50 శాతం మంది రోగులలో ఛాతీ నొప్పి తగ్గడంతో పాటు శారీరక శ్రమ చేసే సామర్థ్యం పెరిగినట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికాలోని ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ఈ సురక్షితమైన చికిత్సను గర్భిణులు, తీవ్రమైన అధిక రక్తపోటు ఉన్నవారు మాత్రం వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది స్టెంట్లు లేదా బైపాస్ సర్జరీకి పూర్తి ప్రత్యామ్నాయం కానప్పటికీ, ఇతర చికిత్సా మార్గాలు లేని ‘నో-ఆప్షన్’ రోగులకు ఇది ఒక అద్భుతమైన పరిష్కారం.

# భారత హాకీ చరిత్రలో మన్‌ప్రీత్ సింగ్ సరికొత్త రికార్డు

అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు

413 మ్యాచ్‌లతో దిలీప్ టిర్కీ రికార్డును అధిగమించిన మన్‌ప్రీత్

రూ. 10లక్షల నగదు బహుమతి ప్రకటించిన హాకీ ఇండియా



భారత హాకీ జట్టు మిడ్‌ఫీల్డ్ జనరల్, స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్‌సింగ్ చరిత్ర సృష్టించాడు. దేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మన్‌ప్రీత్ తన 413వ మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో, హాకీ ఇండియా ప్రస్తుత అధ్యక్షుడు దిలీప్ టిర్కీ (412 మ్యాచ్‌లు) పేరిట ఉన్న రికార్డును మన్‌ప్రీత్ అధిగమించాడు. ఈ చారిత్రక ఘనతను గుర్తించిన హాకీ ఇండియా.. మన్‌ప్రీత్ సింగ్‌ను అభినందించి, రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. పదిహేనేళ్లుగా భారత హాకీ జట్టుకు మన్‌ప్రీత్ గుండెకాయలా నిలుస్తున్నా డని, ఆయన నిలకడ అసాధారణమని కొనియాడింది. 2011లో 19 ఏళ్ల వయసులో భారత జట్టులోకి అడుగుపెట్టిన మన్‌ప్రీత్, టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ప్రపంచంలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ ఐదో స్థానంలో నిలవడం విశేషం. ఈ మైలురాయిపై మన్‌ప్రీత్ సింగ్ స్పందిస్తూ “భారత్ తరఫున ఇన్ని మ్యాచ్‌లు ఆడటం గర్వంగా ఉంది. ఈ విజయాన్ని నా సహచరులకు, కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నా” అని తెలిపాడు. ఒలింపిక్ స్వర్ణం, ప్రపంచ కప్ గెలవాలనేదే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశాడు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ మాట్లాడుతూ “మన్‌ప్రీత్ అంకితభావం, నిలకడకు ఈ రికార్డు నిదర్శనం. భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తి” అని పేర్కొన్నాడు. హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ కూడా మన్‌ప్రీత్‌ను ప్రశంసించారు.

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు..

ఐపీఎస్ సునీల్ కుమార్ నాయక్ పై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

పార్లమెంటుపై దాడి చేసే వారికి, ఎంపీపై దాడి చేసే వారికి తేడా ఏమిటన్న హైకోర్టు

రఘురామను టార్చర్ చేయబోతున్నారనే విషయం సునీల్ నాయక్‌కు తెలుసని వ్యాఖ్య

సునీల్ నాయక్ ఎప్పటిలోగా లొంగిపోతారని ఆయన తరపు న్యాయవాదికి ప్రశ్న



అమరావతి, సింధూరదర్శిని: ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఊహించని సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఏపీ హైకోర్టు ఈరోజు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. నిందితుడిగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “దేశ సర్వోన్నత చట్టసభ అయిన పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు.. అదే పార్లమెంట్‌లో సభ్యుడిగా (ఎంపీగా) ఉన్న వ్యక్తిని కస్టడీలోకి తీసుకుని థర్డ్ డిగ్రీతో దారుణంగా వేధించిన వారికి మధ్య పెద్ద తేడా ఏముంది?” అని జడ్జి సూటిగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు రావడం అత్యంత తీవ్రమైన విషయమని కోర్టు పేర్కొంది. ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి అయి ఉండి... ఇలాంటి అరాచక సంఘ టనల్లో భాగస్వామి కాకుండా తనను తాను నియంత్రించుకోవాల్సిన కనీస బాధ్యత లేదా అని నిలదీసింది. ఎంపీ రఘురామకృష్ణంరాజును వేధింపులకు గురిచేయబోతున్నారనే విషయం సునీల్ కుమార్ నాయక్ కు ముందే తెలుసని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా ఆధారాలు కనిపిస్తున్నాయని కోర్టు స్పష్టం చేసింది. ఒక ఎంపీపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని కోర్టు తేల్చిచెప్పింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు లాయర్‌ను ఉద్దేశించి ‘మీ క్లయింట్ ఎప్పటిలోగా పోలీసుల ఎదుట సరెండర్ అవుతారు?’ అని ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొనసాగిస్తారా? లేక చట్టాన్ని గౌరవించి స్వచ్ఛందంగా వెళ్లి లొంగిపోతారా? అనేది తేల్చుకోవాలని ఆదేశించింది. హైకోర్టు వ్యాఖ్యలపై పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ... కోర్టు అడిగిన ప్రశ్నలపై తమ క్లయింట్ తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని న్యాయస్థానానికి తెలియజేస్తామని చెప్పారు. కేసుకు సంబంధించిన మరికొన్ని కీలక అంశాలను కోర్టు ముందు ఉంచుతామని కోరారు. దీంతో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి తుది తీర్పు ఇవ్వకుండా, హైకోర్టు ఈ కేసు విచారణను రేపటికి వాయిదా వేసింది.

# రైతు ఆత్మహత్యలు పట్టవు.. బీచ్‌ల్లో బార్లపైనే శ్రద్ధ

రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్న శ్రీకాంత్ రెడ్డి

ఎరువుల సరఫరాపై ఎలాంటి ముందస్తు ప్లాన్ కూడా వేసుకోలేదని విమర్శ

వైఎస్ ప్రాజెక్టుల వల్లే రాయలసీమ రైతులు నిలబడ్డారని వ్యాఖ్య



అమరావతి, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో సంక్షోభం నెలకొందని, రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందంటూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ప్రభుత్వం మాత్రం టూరిజం పేరుతో బీచ్‌ల్లో బార్లు పెట్టడంపైనే శ్రద్ధ చూపిస్తోందంటూ మండిపడ్డారు. అన్నపూర్ణగా పేరొందిన ఏపీలో ఇవాళ రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని శ్రీకాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో గిట్టుబాటు ధరలు లేక అనేక మంది రైతులు తనువు చాలించాల్సి వస్తోందని.. అయినా ప్రభుత్వానికి వారి గురించి మాట్లాడే తీరిక లేదన్నారు. గత ఏడాది రైతులు ఎరువులు, విత్తనాలు దొరక్క అల్లాడిపోయారని... అయినప్పటికీ, ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఎరువుల సరఫరాపై ఎలాంటి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోలేదని ఆరోపించారు. రాయలసీమను ‘హార్టికల్చర్ హబ్’ చేస్తామని నమ్మించిన చంద్రబాబు... ఇప్పుడు తోతాపురి మామిడి రైతులను కూడా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్పొరేట్ రంగానికి రెడ్ కార్పెట్ పరుస్తూ... 65 శాతం ఉన్న వ్యవసాయ రంగాన్ని నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ హయాంలో తెచ్చిన ప్రాజెక్టుల వల్లే రాయలసీమ రైతులు నిలబడ్డారని, ఆ తర్వాత జగన్ ప్రభుత్వం రూ.1,700 కోట్లు ఖర్చు చేసి రైతులకు నాణ్యమైన 9 గంటల ఉచిత విద్యుత్ అందించిందని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం మంచి పనులు చేయడం పక్కనబెట్టి, నిత్యం జగన్ మీద విషం చిమ్మడం, డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే పనిగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ రౌడీ షీటర్ సాయికృష్ణ మిస్సింగ్ వ్యవహారంపై ఆయన మాట్లాడుతూ... పోలీసులు సాయికృష్ణని లాకప్‌లో చంపేసి, కనీసం ఆ తల్లికి డెడ్ బాడీ కూడా ఇవ్వకుండా దాచేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలను ప్రశ్నిస్తే ప్రభుత్వం కులాల ప్రస్తావన తెస్తోందని, నిలదీసిన వారి సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేస్తూ అణచివేతకు పాల్పడుతోందని మండిపడ్డారు.

# సినిమా న్యూస్

## వెంకీ-కల్యాణ్‌రామ్ మల్టీస్టారర్.. అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ గ్రాండ్ లాంచ్



టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తి రేపుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రానికి ఈరోజు అధికారికంగా అంకురార్పణ జరిగింది. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, నిర్మాత అల్లు అరవింద్ వంటి సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు.

ఈ సినిమాలో కథానాయికల వివరాలను కూడా చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. వెంకీ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి నటించనుంది. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర నిర్మాణంలో సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడి యోస్ సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. జాతీయ అవార్డు విజేత జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.



## 'పెద్ది'లో మరో ఆరు నిమిషాల కొత్త సన్నివేశాలు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రంలో కీలక మార్పులు చేశారు. విడుదలై రెండు వారాలు పూర్తయిన నేపథ్యంలో ప్రేక్షకులకు మరింత మెరుగైన అనుభూతి కల్పించేందుకు చిత్రంలో కొత్త సన్నివేశాలను జోడిస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.
గురువారం నుంచి థియేటర్లలో ప్రదర్శించే వెర్షన్‌లో అదనంగా 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల కొత్త ఫుటేజీని చేర్చనున్నారు. దీంతో సినిమా నిడివి మరింత పెరగనుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. కొత్త సన్నివేశాలతో 'పెద్ది' అనుభూతి మరింత మెరుగవుతుందని పేర్కొంది. ఇటీవల జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రం నుంచి తొలగించారనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో కొత్త ఫుటేజీని జోడించడం ఆసక్తికరంగా మారింది. అయితే కొత్తగా చేర్చిన సన్నివేశాల్లో ఏమి ఉంటాయనే విషయాన్ని నిర్మాతలు వెల్లడించలేదు. మరోవైపు, గురువారం నుంచి ఈ చిత్రాన్ని సాధారణ టికెట్ ధరలతో ప్రదర్శించను న్నారు. దీంతో ప్రేక్షకుల ఆదరణ మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. జూన్ 4న విడుదలైన 'పెద్ది'కి తొలి రోజుల్లో మంచి స్పందన లభించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో ఈ చిత్రం బలమైన వసూళ్లు సాధించింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం 14వ రోజున దేశవ్యాప్తంగా రూ. 2.45 కోట్ల నికర వసూళ్లు రాబట్టిన ఈ సినిమా మొత్తం ఇండియా నెట్ కలెక్షన్లు రూ. 226 కోట్లకు చేరాయి. గ్రాస్ వసూళ్లు రూ. 267 కోట్లకు పైగా నమోదైనట్లు సమాచారం.
ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందన మధ్య ప్రదర్శితమవుతున్న ఈ చిత్రానికి కొత్త సన్నివేశాలు ఎంతవరకు కలిసివస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

## 'నా పేరు పక్కన కులం పేరు వద్దు'..

### కోలీవుడ్ హీరో సనంత్ సంచలన నిర్ణయం



సినిమా ఇండస్ట్రీలో సెంటిమెంట్లు, పేర్ల మార్పులు చాలా కామన్. కానీ ఒక యంగ్ హీరో మాత్రం తన పేరు చివర ఉన్న కులం పేరును తీసేస్తూ తీసుకున్న బోల్డ్ నిర్ణయం ఇప్పుడు కోలీవుడ్‌తో పాటు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'డిమాంటి కాలనీ', 'పేట', 'మహాన్' వంటి క్రేజీ సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్స్ చేసి గుర్తింపు తెచ్చుకున్న నటుడు సనంత్.. ఇప్పుడు హీరోగా మారారు. ఆయన నటించిన లేటెస్ట్ మూవీ 'హార్టిన్' (ఎముథీఅఅ) ప్రమోషన్స్ వేదికగా ఆయన మీడియాకు ఒక వినూత్న విజ్ఞప్తి చేశారు
చెన్నైలో జరిగిన 'హార్టిన్' ఆడియో, ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సనంత్ మాట్లాడుతూ... ఇకపై తనను పూర్తి పేరు 'సనంత్ రెడ్డి' అని పిలవొద్దని, మీడియాలో కూడా ఎక్కడా అలా రాయొద్దని విజ్ఞప్తి చేశారు. కేవలం 'సనంత్' అని పిలిస్తే చాలని స్పష్టం చేశారు. సాధారణంగా ఇతర భాషా చిత్ర పరిశ్రమల్లో నటీనటులు తమ పేర్ల పక్కన కులం పేరు (సర్నేమ్) జోడించడం కామన్. కానీ తమిళ చిత్ర పరిశ్రమలో ఇలా పేరు పక్కన కులం పేరును పెట్టుకునే సంప్రదాయం లేదు. అందుకే తమిళ సంప్రదాయాన్ని గౌరవిస్తూ తన పేరులోని 'రెడ్డి' అనే పదాన్ని తొలగించినట్లు తెలుస్తోంది.
ఈ సినిమా విషయానికి వస్తే... ఇదొక ఇంట్రెస్టింగ్ ముక్కోణపు ప్రేమకథా చిత్రం. జైపూర్, చెన్నై, ఊటీ వంటి అందమైన లొకేషన్లలో ఈ సినిమా షూటింగ్ జరుపుకుంది. సనంత్ సరసన మడొన్నా సెబాస్టియన్, ఇమయ హీరోయిన్లుగా నటించగా... వాట్సాప్ మణి, డెబ్ నితకర్ ఇతర కీలక పాత్రలు పోషించారు. కిషోర్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా.. 'ప్రేమమ్', 'నేరమ్' చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చిన రాజేష్ మురుగేశన్ దీనికి సంగీతం సమకూర్చారు. స్టెప్ వన్ స్టూడియోస్‌తో కలిసి ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకంపై ఆర్.రవీంద్రన్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలోకి రానుంది.

బ్లాక్ అవుట్‌ఫిట్‌లో స్టైలిష్ కమ్‌బ్యాక్ ఇచ్చిన మోనాల్!

తాజా ఫొటోషూట్‌లో మోనాల్ గజ్జర్ స్టైలిష్ అండ్ మోడరన్ ఆల్-బ్లాక్ కో-ఆర్డ్ సెట్‌లో మెరిసిపోయింది.



## ' థాంక్యూ సుబ్బారావు' (ఆహా) మూవీ రిలీజ్!

క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఒక తెలుగు సినిమా నేరుగా ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చింది. ఆ సినిమా పేరే ' థాంక్యూ సుబ్బారావు'. చంద్రహాస్ కోట్ల – లావణ్య సాహుకార జంటగా నటించిన ఈ సినిమాకి చెందు ముద్దు దర్శకత్వం వహించాడు.'ఓ పిట్టకథ' సినిమాతో దర్శకుడిగా తన మార్క్ చూపించిన సంగతి తెలిసిందే. దినేశ్ కుర్ర నిర్మించిన ఈ సినిమా, ఈ రోజు (జూన్ 18వ తేదీ) నుంచి 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది.
సుబ్బారావు (చంద్రహాస్) తన తండ్రి చేసిన అప్పులు తీర్చడం కోసం, ఏదైనా పని వెతుక్కోవాలని అనుకుంటాడు. కేరళలో ఉన్న స్నేహితుడు 'పండు' రమ్మనడంతో అక్కడికి వెళతాడు. స్నేహితుడితో కలిసి 'బోట్ హౌస్'లో ఉంటూ, టాక్సీ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. అదే సమయంలో ఒక బిజినెస్ డీల్ పై అమెరికా నుంచి 'వైష్ణవి' (లావణ్య) వస్తుంది. నెల రోజుల పాటు తిరగడం కోసం ఆమె సుబ్బారావు టాక్సీని మాట్లాడుకుంటుంది. వైష్ణవితో కలిసి తిరుగుతూ ఉండటంతో సుబ్బారావుకి రోజులు చాలా అందంగా గడిచిపోతున్నట్టుగా అనిపిస్తుంది. ఆమె ఎంతో కలుపుగోలుగా మాట్లాడుతూ ఉండటంతో, తనని ఆమె లవ్ చేస్తుందేమోనని సుబ్బారావు భావిస్తాడు. తానే ప్రపోజ్ చేయడం మంచిదని భావిస్తాడు.
అయితే అదే సమయంలో అమెరికా నుంచి 'రోహిత్' దిగిపోతాడు. అతను .. వైష్ణవి పెళ్లి చేసుకోబోతున్నారనే విషయం తెలిసి, సుబ్బారావు దిగాలుపడిపోతాడు.ఒక రోజున ట్రైన్ రన్నింగ్ లో ఉండగా, ఓ నలుగురు కుర్రాళ్లు ఒక అమ్మాయిని అందులో నుంచి తోసేయడానికి ప్రయత్నించే దృశ్యం వైష్ణవి సెల్ ఫోన్ కి చిక్కుతుంది. దాంతో ఆమె ఆ అమ్మాయి ఎవరు? ఆ కుర్రాళ్లు ఎవరు? ఆ అమ్మాయిని వాళ్లు ఏం చేసి ఉంటారు? అనేది తెలుసుకోవాలని వైష్ణవి నిర్ణయించుకుంటుంది. అందుకోసం ఆమె ఏం చేస్తుంది? పర్యవసానంగా ఎలాంటి పరిణామాలను ఎందుర్కుంటుంది? అనేది మిగతా కథ. అమెరికా నుంచి బిజినెస్ పనిపై వచ్చిన వైష్ణవి, రన్నింగ్ ట్రైన్ లో నలుగురు దుర్మార్గుల కారణంగా ఒక యువతి ప్రమాదంలో ఉండటం గమనిస్తుంది. ఆ యువతి ఆచూకీ తెలుసుకుని ఆమెకి న్యాయం జరిగేలా చేయాలనుకుంటుంది. అందుకోసం తన బిజినెస్ పనులను సైతం పక్కన పెడుతుంది. ఈ విషయంలో ఆమెకి ఒక టాక్సీ డ్రైవర్ ఎలా సహాయం చేస్తాడు? ఆమె ప్రయత్నం ఫలిస్తుందా లేదా? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. ఈ కథ 'కేరళ'లో జరుగుతుంటుంది. ఎంగేజ్ మెంట్ జరుపుకున్న వైష్ణవి – రోహిత్, కేరళలో హోటల్ బిజినెస్ చేయడానికి తగిన అనుమతుల కోసం ట్రై చేస్తుండటం .. వాళ్లకి టాక్సీ డ్రైవర్ గా కుదిరిన సుబ్బారావు, వైష్ణవిని ఆరాధిస్తూ ఉండటం .. ప్రమాదంలో పడిన ఒక యువతిని రక్షించడం రంగంలోకి దిగిన వైష్ణవి, రోహిత్ ను – సుబ్బారావును సాయం కోరడం అనే ఈ మూడు కోణాలలో




ఈ కథ ముందుకు వెళుతుంటుంది. సుబ్బారావు కేరళ చేరుకోవడం .. అమెరికా నుంచి వైష్ణవి రావడం .. ఇద్దరి మధ్య పరిచయం తాలూకు సన్నివేశాలతో ఈ కథ అలరిస్తూ వెళుతుంది. ఎప్పుడైతే వైష్ణవికి కాబోయే భర్తగా రోహిత్ ఎంట్రీ ఇచ్చాడో అప్పటి నుంచి కథ మరింత ఊపందుకుంటుంది. వైష్ణవి ముందు సుబ్బారావును అవమానించడానికి రోహిత్ ట్రై చేయడం, అతణ్ణి ఉడికించడానికి సుబ్బారావు ప్రయత్నించడం వంటి సన్నివేశాలతో లవ్ కి కాస్త కామెడీ కనెక్ట్ అవుతుంది. ఇక ఎప్పుడైతే ట్రైన్ లో ఒక ఆడపిల్లను వేధిస్తున్న రౌడీ గ్యాంగ్ ను వైష్ణవి చూసిందో .. ఆ విషయాన్ని గురించి ఆరాతీయడానికి రంగంలోకి దిగుతుందో అప్పటి నుంచి కథ మరో మలుపు తీసుకుంటుంది. ట్రైన్ లో వేధింపులకు గురైన ఆ యువతి ఎవరు? ఆమెను వేధించిన పోకిరీలు ఎవరు? అనే కోణంలో చకచకా సన్నివేశాలను మార్చుకుంటూ ఈ కథ పరుగులు తీస్తుంది. లవ్ .. కామెడీ .. క్రైమ్ ను టచ్ చేస్తూ సాగే ఈ కంటెంట్ ఫరవాలేదనిపిస్తుంది.మూడు ప్రధానమైన పాత్రల చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినా, ట్రీట్మెంట్ బాగుంటుంది. అయితే లవ్ ట్రాక్ విషయంలో ఆడియన్స్ గెస్ చేసినట్టుగానే కథ వెళ్లడమే ప్రధానమైన లోపంగా అనిపిస్తుంది. కేరళలోని సన్నివేశాలు ఈ కథకు అదనపు ఆకర్షణగా నిలిస్తే, క్లైమాక్స్ లో వచ్చే ట్విస్ట్ ఈ కథకి మరింత బలాన్ని చేకూర్చుతుంది.
ప్రధానమైన పాత్రలను పోషించిన ముగ్గురు ఆర్టిస్టులు తమ పాత్రలకి న్యాయం చేశారు. హీరో చంద్రహాస్ ను చూస్తుంటే, చాలావరకూ '=శ 100' హీరో కార్తికేయ పోలికలు కనిపిస్తాయి. బాడీ లాంగ్వేజ్ కూడా దాదాపుగా అలాగే అనిపిస్తుంది. పంకజ్ తొత్తాడ ఫొటోగ్రఫీ .. ప్రిన్స్ హెన్రి సంగీతం .. వెంకట్ ప్రభు ఎడిటింగ్ ఫరవాలేదు. చిన్న సినిమానే అయినా, ఒక పెర్ఫెక్ట్ అవుట్ పుట్ తో వచ్చిన కంటెంట్ గా చెప్పుకోవచ్చు.

సినిమా వివరాలు
సినిమా పేరు: ధన్యవాదాలు సుబ్బారావు
విడుదల తేదీ: 2026-06-18
తారాగణం: చంద్రహాస్, లావణ్య, రోహిత్, మురళోధర్ గౌడ్, చల్లా రమణ
దర్శకుడు: చెందు ముద్దు
సంగీతం: ప్రిన్స్ హెన్రీ
బ్యానర్: కుర్ర ప్రొడక్షన్స్
సమీక్ష: పెద్దింటి
ధన్యవాదాలు సుబ్బారావు రేటింగ్: 5కి 2.00

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410.
Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662